సాక్షి నంద్యాల

గురువారం । 28 । నవంబర్ । 2024



సాక్షి గణపతికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతికి, జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదిక బుధవారం కడపకు చెందిన సాయి నటరాజ డ్యాన్స్ అకాడమీ నృత్యం, తెనాలి చిన్మయి బృందం భక్తి రంజని కార్యక్రమాలు అలరించాయి.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,630.06
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:94.276
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,302
అవుట్ ఫ్లో	:6,984

- కూటమి పాలనపై నిరసనల హోరు
- హామీలు విస్మరించడంతో ప్రజలు, ఉద్యోగుల ఆందోళన బాట
- ధర్నాలతో రోజూ దద్దరిల్లుతున్న కలెక్టరేట్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు
- ఉద్యోగ భద్రత కోసం వలంటీర్లు, ఇళ్ల స్థలాల కోసం పేదల ధర్నా
- న్యాయం చేయాలని 104, 108 ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ఆందోళనలు
- కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాల నిరసన
- గత ప్రభుత్వ హయాంలో సాఫీగా సాగిన పాలనతో నిరసనలకు దూరం

నారా వారి నయవంచన పాలనపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుండటంతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. సంక్షేమాన్ని విస్మరించడంతో పేదలు, జీవితాలతో చెలగాటమాడటంతో ఉద్యోగులు న్యాయం కోసం రోడ్డెక్కుతున్నారు. దగా పడి పిడికిలి బిగించి పోరుబాట పట్టారు. వేతనాలు అందక కొందరు.. ఉద్యోగాలు తొలగిపోయి మరికొందరు.. డిమాండ్ల సాధన కోసం ఇంకొందరు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు సమస్యల పరిష్కారానికి నిరసన గళమెత్తారు.

నయవంచనపై జనాగ్రహం



నంద్యాల: కూటమి సర్కార్ తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ప్రజలు రోడ్డెక్కుతున్నారు. తమ హక్కులను సాధించుకోవడం కోసం ఆందోళన బాట పడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రోజుకో ధర్నా.. పూటకో నిరసన చేసి ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. కలెక్టరేట్ ఎదుట రోజూ కనీసం మూడు, నాలుగు ఆందోళనలు జరుగుతున్నాయి. అయితే ప్రజా ఉద్యమాలను పోలీసులతో అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడు ప్రజలు రోడ్డెక్కలేదు. ఆందోళనలు చేయలేదు, రాస్తారోకో చేపట్టలేదు. వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించడంతో పాలన ఎంతో సాఫీగా సాగింది. ముఖ్యంగా ప్రజలకు కావాల్సిన ఇంటిస్థలం, ఇళ్ల నిర్మాణం, ఫీజురీయింబర్స్‌మెంట్, స్కీం వర్కర్లకు వేతనాల పెంపు, సమయానికి అందించడం, ఉచిత ఇసుక, మద్యం తదితర సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించడంతో ఆందోళన చేయాల్సిన పనే రాలేదు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళ్తుండడంతో ప్రజలు రోడ్డెక్కుతున్నారు. 108, 104 ఉద్యోగులు, వెలుగు వీవోఏలు, వలంటీర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, కార్మికులు, రైతులు, ప్రజలు ఇలా.. అన్ని వర్గాల వారు తమ సమస్యలపై నిరసన గళం వినిపిస్తున్నారు. ఆరు నెలలుగా నిత్యం ఆందోళనలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వంలో చలనం లేదు.



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న వెలుగు యానిమేటర్లు(ఫైల్)



వేతనాలు పెంచాలని నంద్యాల కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ఆందోళన (ఫైల్)

రోడ్డెక్కిన స్కీం వర్కర్లు

గత ప్రభుత్వ హయాంలో స్కీం వర్కర్లకు అన్ని సదుపాయాలు కల్పించి సమయానికి జీతాలు ఇస్తుండడంతో ఆందోళనలకు దిగేవారు కాదు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో స్కీం వర్కర్ల ఆందోళనలు నిత్యకృత్యమయ్యాయి. పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలు, ఆయాలు, ఆశా వర్కర్లు, ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లు తమను అన్యాయంగా ప్రభుత్వం మారడంతో తొలగిస్తున్నారని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆందోళనలు చేపడుతున్నారు. అలాగే అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లకు గత ప్రభుత్వ హయాంలో జీతాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మహిళలు రోడ్డెక్కుతున్నారు. ఉద్యోగ భద్రత కోసం 108,104 ఉద్యోగులు పలు ఆందోళనలు చేపట్టారు.



కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు(ఫైల్)

ఫీజు అందక.. చదువులు సాగక..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు అనే పదమే వినిపించలేదు. మూడు దఫాలుగా ప్రభుత్వమే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనల కింద ఫీజు చెల్లిస్తుండడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసించారు. అయితే కూటమి సర్కార్ వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నోరు మెదపడం లేదు. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజు కట్టాలని విద్యార్థులను ఒత్తిడి చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసరవస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. బియ్యం కేజీ రూ.80 వరకు, ఆయిల్ లీటర్ రూ.200, బ్యాళ్లు రూ.180 వరకు పెరిగిపోవడంతో ఆందోళనలు ఉద్ధృతంగా జరిగాయి.

సూపర్ సిక్స్ హామీల కోసం..

ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నాయి. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు ఇవ్వాలని, మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వాలని, రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని, ఉచిత బస్సు ఎక్కించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న డిమాండ్లతో రోజూ ఆందోళనలు జరుగుతున్నాయి.

రోడ్డున పడి.. పోరుబాట



విధుల్లోకి తీసుకొని, రూ.10వేల జీతం ఇవ్వాలని ధర్నా చేస్తున్న వలంటీర్లు(ఫైల్)

ఎన్నికల సమయంలో ఉద్యోగ భద్రతతోపాటు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వలంటీర్లకు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక వారి సేవలను వినియోగించుకోకుండా పక్కన పెట్టేయడంతో వలంటీర్లు ఆందోళనకు దిగుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత, రూ.10 వేల వేతనంతోపాటు పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ అంశంపై వారంలో నాలుగైదు రోజులు ఆందోళనలు, రాస్తారోకోలు, వినూత్న నిరసనలు ఉంటున్నాయి.

ఉపాధ్యాయులు ఆందోళన బాట



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

చంద్రబాబు తమను కూడా మోసం చేశారని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆందోళన బాట పట్టాయి. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ బకాయిలు, ఐఆర్, పదోన్నతులు, జీపీఎఫ్ పెండింగ్ అంశాలను పరిష్కరించాలని, మునిసిపల్ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపట్టాయి.

కార్మికులు, కర్షకుల కన్నెర్ర..



సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల ధర్నా

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకు జూలై 8వ తేదీన ఉచిత ఇసుక పాలసీని ప్రకటించింది. ఈ పాలసీ ప్రకారం గతం కంటే ఇసుకను అధికంగా కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఒకవేళ కొనుగోలు చేద్దామని అనుకున్నా అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ పనులు పలు చోట్ల నిలిచిపోయాయి. దీంతో కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సి వస్తోంది. దీంతో భవన నిర్మాణ కార్మికులు ఇసుక కోసం నిత్యం ఆందోళనలు చేపడుతున్నారు. వారికి మద్దతుగా ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు జరుగుతున్నాయి. వారికి మద్దతుగా ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు జరుగుతున్నాయి.



మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని ఆందోళన

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి. వలంటీరు వ్యవస్థ లేదని మంత్రి చెప్పడం తగదు. ఎన్నికల ముందు వలంటీర్లకు జీతం రూ.10 వేలు చేస్తామని చెప్పి.. ఇప్పుడు మోసం చేయడం పద్ధతి కాదు.

– బాలవెంకట్, సీఐటీయూ సెక్రటరీ, నంద్యాల

హామీలు నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వం ఎన్నిక హామీలను వెంటనే నెరవేర్చాలి. ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి. పాఠశాలలో పనిచేసే చిన్న స్థాయి వర్కర్లను, గ్రామాలలో ఫీల్డ్‌అసిస్టెంట్లు వంటి చిరుద్యోగులను తొలగిస్తున్నారు. ఇలాంటివి వెంటనే మానుకొని తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి. హామీలు అమలు చేయకుండా ఇలాగే వ్యవహరిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. – ప్రసాద్, కార్యదర్శి, సీపీఐ, నంద్యాల

ప్రభుత్వంపై ప్రజల్లో అసమ్మతి



ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడవక ముందే ప్రజల్లో తీవ్ర అసమ్మతి నెలకొంది. సూపర్‌సిక్స్ అంటూ ఎన్నో మాయమాటలు చెప్పి చంద్రబాబు గద్దెనెక్కారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారు. ఉద్యోగులు, ప్రజలు రోడ్డెక్కి తమ సమస్యలు పరిష్కారించాలని ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేరు.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

న్యూస్‌రీల్

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మొక్క నాటుతున్న డీఈఓ జనార్దనరెడ్డి

ఆళ్లగడ్డ: ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ జనార్దనరెడ్డి సూచించారు. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, బాలికల వసతి గృహాలను ఆయన బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మోడల్ స్కూల్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

శ్రీశైలం నుంచి 41,744 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి 41,744 క్యూసెక్కుల నీటిని మంగళవారం నుంచి బుధవారం వరకు దిగువ ప్రాజెక్ట్‌లకు విడుదల చేశారు. తెలంగాణ ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో 13.664 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి అనంతరం నాగార్జునసాగర్‌కు 30,733 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 7,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,611 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం సాయంత్రానికి జలాశయంలో 133.6290 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యాం నీటిమట్టం 868 అడుగులకు చేరుకుంది.

పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వీడండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

దొర్నిపాడు: ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందించడంలో నిర్లక్ష్యం వీడాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. బుధవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, చాకరాజువేముల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. ఎంతమంది చిన్నారులు, గర్భిణులు ఉన్నారని ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలకు అందించే పోషన్ అభియాన్ కిట్లను సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. గుడ్లు ఇవ్వలేదని తెలుసుకుని కార్యకర్తలను ప్రశ్నించగా వారు ఏజెన్సీ వాళ్లు సరఫరా చేయలేదని సమాధానం చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. ముందుగా తెప్పించుకోవాల్సిన బాధ్యతా లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనతంరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి పంటల బీమా ప్రీమియం చెల్లింపుపై ఆరా తీశారు. ప్రతి రైతు పంట బీమా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. చాకరాజువేముల ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, చిన్నారులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



డబ్ల్యూ.కొత్తపల్లె చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

1,169 గృహాలు పూర్తి కావాలి

నంద్యాల: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూఫ్, ఆర్‌సీ స్థాయిలో ఉన్న 1,169 గృహాలు డిసెంబర్ 15వ తేదీ నాటికి పూర్తిచేసి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి హౌసింగ్ డీఈ, ఏఈలనులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పూర్తి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్ని మండలాల నుంచి లబ్ధిదారుల జాబితాను రెండు రోజుల్లో పంపడంతోపాటు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాలు నిర్వహించుకుని రోజువారీ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. డీఆర్‌డీఏ ద్వారా రూ.లక్ష రుణ మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. పూర్తయిన ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ



విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

మహానంది: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ వైద్య సిబ్బందికి సూచించారు. తిమ్మాపురం పీహెచ్‌సీని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చేరుకుని ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా వైద్య సేవల వివరాలతో రికార్డులు ఇస్తామన్నారు. బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఫలితాలను వాటిలో పొందుపరిచి అవసరమైన వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. జిల్లాలోని గ్రామాల్లో 30 ఏళ్ల వయసు పైబడిన వారికి ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది చేస్తున్న క్యాన్సర్ పరీక్షల్లో భాగంగా ఓరల్ క్యాన్సర్ తొమ్మిది, బ్రెస్ట్ క్యాన్సర్ 3, సర్వైకల క్యాన్సర్ మూడు గుర్తించామన్నారు. ఓరల్ క్యాన్సర్‌లో 2,598 మంది, బ్రెస్ట్ క్యాన్సర్ 373 మంది, సర్వైకల్ కాన్సర్‌లో 161 మంది అనుమానితులుగా గుర్తించామని, మరిన్ని పరీక్షల అనంతరం నిర్ధారణ కావాల్సి ఉందన్నారు. అవసరమైన వారికి ఎన్‌టీఆర్ ట్రస్ట్ సేవా ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఆయన వెంట డాక్టర్ భగవాన్‌దాస్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి ఉన్నారు.

వచ్చే నెల 8న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): జాతీయ ఉపకార వేతన పరీక్ష డిసెంబర్ 8న నిర్వహించనున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్ టికెట్‌లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్ సైట్ WWW.bse.ap.gov.in స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు యూడైస్ కోడ్‌తో లాగిన్ అయి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు.

35వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం



పెద్దకంబలూరు మెట్ట వద్ద నర్సరీని పరిశీలిస్తున్న బాలాజీనాయక్

రుద్రవరం: రాష్ట్రంలో ఈ ఏడాది 35వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు ప్రభుత్వ లక్ష్యమని ఉద్యానవన శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ బాలాజీ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దకంబలూరు మెట్ట వద్ద ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ నర్సరీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రవరం మండలంలో 12 ఎకరాల్లో అత్యాధునిక టెక్నాలజీతో నర్సరీలో మొక్కలను పెంచుతున్నారన్నారు. అక్కడి నుంచి రైతులకు మొక్కలు సరఫరా చేయిస్తామన్నారు. 2024–25 ఏడాదిలో ఆయిల్ పామ్ నర్సరీల నిర్వాహణకు ప్రభుత్వం రూ.380 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆయన వెంట ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నాగరాజు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ దందా..!

- రీచ్‌లు అందుబాటులో లేకపోవడంతో ఇసుక కోసం ప్రజల ఇక్కట్లు
- నాలుగు స్టాక్ యార్డ్‌లకు లైసెన్స్‌లు ఇచ్చినా నేటికీ ప్రారంభించని జిల్లా యంత్రాంగం



ఆళ్లగడ్డలో ప్రారంభంకాని ఇసుక స్టాక్ యార్డ్

సాక్షి, నంద్యాల: కూటమి ప్రభుత్వంలో నిర్మాణ రంగం కుప్పకూలుతోంది. అవసరమైన ఇసుక అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టన్ను ఇసుక కోసం కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి. ఎక్కడ దొరుకుతుందో, ఎలా తెచ్చుకోవాలో తెలియడం లేదు. ఆన్‌లైన్ బుకింగ్ అని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఎలా బుక్ చేసుకోవాలో తెలియక అవసరార్థులు ఇసుక మాఫియాను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

200 కి.మీ దూరంలో రీచ్..

జిల్లాలో ఇసుక రీచ్‌లు లేవు. కర్నూలు జిల్లాలోని గుడికంబాలి వద్ద ఉన్న రీచ్ నుంచి తెచ్చుకోవాల్సి ఉంది. నంద్యాల నుంచి సుమారు 210 కి.మీ పైగా దూరం ఉండడంతో లారీ ఇసుక కోసం రూ.28 వేల వరకు ఖర్చు చేయాల్సిన దుస్థితి. ఆళ్లగడ్డకి 250 కి.మీ, నందికొట్కూరు నుంచి 150 కి.మీ, ఆత్మకూరు నుంచి 180 కి.మీ దూరం ఉంది. దీంతో బ్లాక్ దందా విపరీతంగా పెరిగింది. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు గాకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి అధికార పార్టీ నేతలు భారీగా సంపాదిస్తున్నారు.

జమ్మలమడుగు నుంచి యథేచ్ఛగా సరఫరా

జమ్మలమడుగులోని పెన్నా నది నుంచి ఆళ్లగడ్డ, నంద్యాలకు ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. జమ్మలమడుగులో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే అక్రమ వ్యాపారం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జమ్మలమడుగు, పెద్దముడియం మీదుగా ఇసుక ట్రాక్టర్లు ఆళ్లగడ్డకు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి నంద్యాలకు తెల్లవారుజామున చేరుకుంటున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇసుక డిమాండ్‌ను బట్టి రూ.7 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. నొస్సం మీదుగా కోవెలకుంట్ల, బనగానపల్లెకు కూడా పెన్నానది నుంచే అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. డోన్‌కు పామిడి, చెరుకులపాడు సమీపంలోని హంద్రీ నది నుంచి అక్రమంగా సరఫరా చేస్తున్నారు. ట్రాక్టర్ రూ.7 వేల వరకు విక్రయిస్తున్నారు. నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాలకు తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు.

స్టాక్ పాయింట్లు ఎక్కడ?

అధికార యంత్రాంగం నవంబర్ 6న ఇసుక స్టాక్ యార్డ్‌ల కోసం పత్రికా ప్రకటన విడుదల చేసింది. గడువు 12వ తేదీతో ముగిసింది. నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాలకు సంబంధించి 14వ తేదీ లక్కీడిప్ తీసి లైసెన్స్‌లు మంజూరు చేశారు. లైసెన్స్ దక్కించుకున్న వారు వారం లోపు ఇసుక నిల్వ కేంద్రాలను ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటికీ ఒక్క స్టాక్ యార్డ్‌ను కూడా ప్రారంభించలేదు. ఆత్మకూరు, డోన్‌లకు ఇసుక స్టాక్ యార్డ్ పాయింట్లకు సంబంధించి లక్కీ డిప్ తీయాల్సి ఉంది.

చేయి తడిపితేనే ఇసుక ట్రాక్టర్ ముందుకు

జమ్మలమడుగు నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్ల నుంచి మామూళ్లు వసూలు చేసి సంబంధిత అధికారులు అక్రమ రవాణాకు పచ్చజెండా ఊపుతున్నారు. పెద్దముడియం వద్ద పోలీసులకు మామూళ్లు ముట్టజెప్పకుంటే ట్రాక్టర్ ముందుకు కదలని పరిస్థితి. ఆళ్లగడ్డ, నంద్యాల పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు నెల మామూళ్లు వస్తున్నట్లు సమాచారం.

ఎలా బుక్ చేసుకోవాలో తెలియదు



ఇసుక ఉచితం అని చెబుతున్నారు. కానీ ఎక్కడా ఫ్రీగా ఇవ్వడం లేదు. ట్రాక్టర్ ఇసుక కొనుగోలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆన్‌లైన్‌లో ఎలా బుక్ చేసుకోవాలో తెలియడం లేదు. కామన్ సర్వీస్ సెంటర్లకు వెళితే బుకింగ్‌కు రూ.50 అడుగుతున్నారు. సచివాలయాలకు వెళితే అక్కడ ఎవరూ అందుబాటులో ఉండడం లేదు.

– ఎల్లయ్య, చాపిరేవుల, నంద్యాల మండలం

నియోజకవర్గం	యార్డుల సంఖ్య	టన్ను ఇసుక
నంద్యాల	01	రూ.884
బనగానపల్లె	01	రూ.884
ఆళ్లగడ్డ	01	రూ.719
నందికొట్కూరు	01	రూ.744
ఆత్మకూరు	01	రూ.884
డోన్	01	రూ.744

క్లుప్తంగా

సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి విజేత అనంతపురం

● రన్నర్‌గా ఈస్ట్ గోదావరి



విన్నర్స్‌గా నిలిచిన అనంతపురం సెపక్‌తక్రా జట్టు

నందికొట్కూరు: పట్టణంలోని నవనంది ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో అనంతపురం జిల్లా విజేతగా నిలిచింది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో ఈస్ట్‌గోదావరి జట్టుపై అనంతపురం జట్టు విజయం సాధించింది. దీంతో ఈస్ట్‌గోదావరి జట్టు రన్నర్‌గా నిలిచింది. ప్రకాశం జిల్లా జట్టు మూడో స్థానంతో సరిపెట్టుకుంది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్రీడాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

కర్నూలు (సెంట్రల్) : బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ బంగ్లాలో బాల్య వివాహాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు రూపొందించిన బాల్య వివాహ ముక్తి భారత్ పోస్టర్లను కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో బాల్య వివాహాలు తరచూ జరుగుతున్నాయన్నారు. అక్కడి ప్రజల్లో చైతన్యం కోసం అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీసీపీఓ శారద, ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

● ముగ్గురికి తీవ్రగాయాలు



గంజిహళ్లి రోడ్డులో అదుపుతప్పి గుంతలో పడిన ఆటో

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామం రోడ్డులో ఎల్లెల్సీ కాలువ సమీపంలో మలుపు దగ్గర బుధవారం సాయంత్రం ఆటో బోల్తా పడింది. ఈఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రం గోనెగండ్ల నుంచి బుధవారం సాయంత్రం ఆటో ఎక్కి 12 మంది గంజిహళ్లి గ్రామానికి బయలు దేరారు. ఎల్లెల్సీ కాలువ సమీపంలో ముందుగా వెలుతున్న ఆర్‌టీసీ బస్సును తప్పించబోయి ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. ఇందులో ఉన్న మాల నరసమ్మ, పెద్ద రంగప్ప, వీరాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెలుతున్న వారు గమనించి గాయపడిన క్షతగాత్రులను ఆటోలో గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తీవ్రంగా గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా!



ఉసిరి చెట్టు వద్ద పూజలు చేసి హారతి పడుతున్న ఎస్పీ బిందు మాధవ్



మ్యూజికల్ చైర్స్ ఆట ఆడుతున్న జేసీ నవ్య, జిల్లా మహిళా అధికారులు



మొక్క నాటి నీళ్లు పోస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, చిత్రంలో జేసీ నవ్య, డీఎఫ్ఓ శ్యామల



వాలీ బాల్ గేమ్‌లో బాల్ పాస్ చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

● ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్న కలెక్టర్, జేసీ
● అటవీ శాఖ ఆధ్వర్యంలో వేడుకగా వనభోజన మహోత్సవం

కర్నూలు కల్చరల్: నిత్యం పని ఒత్తిడితో ఉండే జిల్లా ఉన్నతాధికారులు ఆట పాటలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష టగ్ ఆఫ్ వార్, వాలీ బాల్ ఆటల్లో, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. నవ్య మ్యూజికల్ చైర్స్‌లో అధికారులతో కలిసి ఆడి హుషారెత్తించారు. టగ్ ఆఫ్ వార్, వాలీబాల్ ఆటల్లో కలెక్టర్ టీం గెలుపొందింది. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహ పాటలు పాడి అలరించారు. ఇందుకు బుధవారం పుల్లయ్య పార్క్ వేదికైంది. ఇక్కడ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజన మహోత్సవం వేడుకగా సాగింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో పాటు జిల్లా అటవీ శాఖ అధికారి పి. శ్యామల విజయ వనంలో మొక్కలు నాటారు. అనంతరం ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విజయ వనం పచ్చదనం ఆహ్లాదకర వాతావరణంతో అలరారుతోందన్నారు. రూ. 1.40 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయన్నారు. మరో రూ. 40 లక్షలతో యోగా పార్క్, పిల్లల ఆటలు ఆడే ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అటవీ ప్రాంతం తగ్గుతుందన్నారు. దీంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో నగర వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. నిత్యం పనిఒత్తిడితో గడిపే అధికారులకు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సందీప్ కుమార్, సీపీఓ హిమ ప్రభాకర్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వర రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, డీఎస్‌డీఓ భూపతి రావు, పర్యాటక శాఖ అధికారిణి విజయ, అటవీ శాఖ ఫ్లైయింగ్ స్క్వాడ్ రేంజ్ అధికారి రమణారెడ్డి, కర్నూలు, ఆదోని రేంజ్ అధికారులు విజయకుమార్, తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఉసిరిచెట్టు కింద భోజనం ఆరోగ్యకరం

కర్నూలు : కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే మంచి జరగడంతో పాటు ఆరోగ్యకరమని ఎస్పీ బిందు మాధవ్ పోలీసు సిబ్బందికి సూచించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ పరిపాలన విభాగం ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం డీపీఓ కార్యాలయ ఆవరణలో వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం సిబ్బందితో కలసి ఆ చెట్టు కింద వనభోజనం చేశారు.కార్యక్రమంలోఅడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా,డీపీఓ కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

జింక మృతి



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఓ సుబ్బయ్య

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామ సమీపంలో కృష్ణ జింక మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రైస్ మిల్ ఎదురుగా ఉన్న పొలంలో జింక మృతిచెంది ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు.. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌ఓ సుబ్బయ్య, మండల బీట్ ఆఫీసర్ సురేంద్ర నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జింక ఎక్కువగా పరుగెత్తడం వల్ల ఇంటర్నల్ బ్లీడింగ్ అయి మృతిచెంది ఉంటుందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

● భార్యాభర్తలపై చీటింగ్ కేసు నమోదు

కోవెలకుంట్ల: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని ఓ యువకుడిని మోసం చేసిన ఘటనలో భార్య, భర్తలపై పోలీసులు బుధవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని పొట్టిపాడుకు చెందిన మల్లికార్జునరెడ్డికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం ఇస్తామని నంద్యాలకు చెందిన భార్య, భర్తలు మహేశ్వరి, వెంకట్.. కన్సల్టెన్సీ పేరుతో నమ్మబలికి ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.1.70 లక్షలు తీసుకున్నారు. అప్పుడు ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తూ వస్తుండటంతో విసుగు చెందిన యువకుడు డబ్బు వెనక్కి ఇవ్వాలని కోరాడు. ఉద్యోగ ఇప్పించక, డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో యువకుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తూ నీటిలో పడి..

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న గాలేరు నగరి (జీరో గేట్ల)వద్ద కాల్వలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. బాధిత కుటుంబానికి విషాదం నింపిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. పాణ్యం చెంచుకాలనీలో నివాసముంటున్న అంకన్నకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. బుధవారం జీరో గేట్ల వద్ద చేపలు పట్టుకునేందుకు అంకన్న వలలు వే శాడు. వాటిలో చేపలుపడ్డాయా? లేదా? అని చూసేందుకు వెళ్లాడు. అక్కడే ఉన్న పెద్ద కుమారుడు వీరయ్య (13) జారిపడి కాల్వలో పడ్డాడు. గేట్ల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకోపోయాడు.గమనించిన తండ్రి వెంటనే గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి బాలుడిని బయటకు తీశారు. అయితే, అప్పటికే ఈ బాలుడు మృతి ఉండటంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

భార్యను హతమార్చిన భర్త

తుగ్గలి: భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైన సంఘటన తుగ్గలి మండలం రాంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాంపల్లికి చెందిన ఏకాశి రామానాయుడుకు రామలింగాయపల్లికి చెందిన సరోజ (36)తో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్న ఈ దంపతులు వ్యవసాయంతో పాటు బట్టల దుకాణం నడుపుకుంటూ జీవనం సాగించే వారు. ఈ క్రమంలో భార్యపై అనుమానంతో కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో దూరంగా ఉంటున్నారు. సరోజ కొడుకులతో కలిసి అదే గ్రామంలో వేరుగా ఉంటూ బట్టలు అమ్ముకుంటూ, టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రామానాయుడు ఏడాదిన్నర క్రితం మరో యువతిని పెళ్లి చేసుకున్నారు. ఈ విషయమై కేసు కూడా నడుస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం ఇంటో ఉన్న భార్య సరోజపై భర్త కొడవలితో విచక్షణా రహితంగా దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడు. ఈ విష యం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, తుగ్గలి ఎస్‌ఐ కృష్ణమూర్తి ఘటనా స్థలానికి చేరుకుని హత్యకు కారణాలపై ఆరా తీసి వివరాలు సేకరించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తాపడి ఎక్సైజ్ అధికారులకు గాయాలు





ప్రమాదంలో గాయపడిన సీఐ సుభాషిణిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం , ప్రమాదానికి గురైన కారు

● సీఐ సుభాషిణి పరిస్థితి విషమం

కర్నూలు: జిల్లాలో సారా స్థావరాలపై దాడులకు వెళ్లిన ఎక్సైజ్ అధికారుల వాహనం బోల్తాపడి సీఐ, ఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో సీఐ సుభాషిణి పరిస్థితి విషమంగా ఉంది. కర్నూలు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సీఐ సుభాషిణి, ఎస్‌ఐ మారుతీప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు, కానిస్టేబుళ్లు పరిషిత్‌గౌడ్, జయచంద్రుడు, శంకర్ నాయక్.. డ్రైవర్ వంశీతో కలిపి ఏడుగురు బుధవారం కర్నూలు నుంచి పత్తికొండ ప్రాంతంలోని సారా తయారీ స్థావరాలపై దాడులకు వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో తిరిగి కర్నూలుకు వస్తుండగా దేవనకొండ టర్నింగ్ దాటిన తర్వాత గుంతలు తప్పించే ప్రయత్నంలో మోటర్ సైకిల్ అడ్డువచ్చింది. దాన్ని కూడా తప్పించే ప్రయత్నంలో ఎక్సైజ్ అధికారుల కారు అదుపు తప్పి పొలాల్లోకి మూడు పల్టీలు కొట్టింది. సీఐ, ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందడంతో పత్తికొండ సీఐ విశ్వేశ్వరరావు వెంటనే అక్కడికి చేరుకుని గాయపడినవారిని అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. గాయపడినవారిలో సీఐ సుభాషిణి పరిస్థితి విషమంగా ఉంది. కర్నూలు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఏఈఎస్ రాజశేఖర్‌గౌడు, ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

విద్యార్థి ప్రాణాలు కాపాడిన ఎస్‌ఐ

● ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ సెల్ఫీ వీడియో
● లొకేషన్ గుర్తించి ఆసుపత్రికి తరలింపు



ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి రాముడు

కర్నూలు/ఎమ్మిగనూరు రూరల్: ఆత్మాహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని ఎమ్మిగనూరు స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడారు. ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామానికి చెందిన మార నర్సన్న కుమారుడు రాముడు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కాగా వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. ఈ మేరకు బుధవారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని ఎద్దుల మార్కెట్ నుంచి హైకొండకు వెళ్లే దారిలో పురుగు మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకుని సన్నిహితుడైన రంగయ్య అనే వ్యక్తికి పంపించాడు. అతని ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్‌బీ ఎస్‌ఐ వెంటనే కర్నూలులోని సైబర్ ల్యాబ్ పోలీసుల సహాయంతో రాముడు ఉన్న ప్రాంతాన్ని తెలుసుకుని వారి బంధువులు, స్నేహితులను అప్రమత్తం చేశారు. బంధువులతో ఘటనా స్థలాన్ని చేరుకుని రాముడుని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ దగ్గరుండి వైద్యులతో మెరుగైన వైద్యం చేయించడంతో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు. చాకచక్యంగా వ్యవహరించి విద్యార్థి ప్రాణాలు కాపాడిన ఎస్‌బీ ఎస్‌ఐ వేణుగోపాల్ రాజును జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్‌యూ కబడ్డీ మహిళా జట్టు ఎంపిక



ఆర్‌యూ మహిళల కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు (టౌన్): తమిళనాడు రాష్ట్రంలోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు బుధవారం రాయలసీమ యూనివర్సిటీ మహిళల కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 2 వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఈ ఎంపికైన జట్టుకు స్థానిక రాయలసీమ యూనివర్సిటీలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి యూనివర్సిటీకీ మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. శివకిషోర్ జట్టు వివరాలు ప్రకటించారు. మహిళా జట్టులో జి.కీర్తన, డి. పద్మ, ఎం. మంచాల తేజ, ఎస్. శ్రావణి, పి.రేవతి. ఎ.సుమతి, టి. భారతి, డి. మంజుల, సి. గాయత్రీ, జి. హర్షిత ఉన్నారు.

సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(రూరల్): రాయలసీమలోని ప్రాజెక్ట్‌ల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. సమితి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీరు విడుదల చేస్తుండటంతో ఆయా ప్రాజెక్ట్‌ల కింద ఉన్న ఆయకట్టు భూములకు నీరు అందడం లేదన్నారు. రాయలసీమలో తాగు, సాగునీరు అవసరాలు తీరిన తరువాతే విద్యుత్ ఉత్పత్తిని చేపట్టాలని రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు వైఎస్ రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లి డీజే జీపు ఢీకొని బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు

కోసిగి: పెళ్లి సంబరంలో విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తూ పెళ్లి డీజే జీపు ఢీకొని బాలుడి మృతి చెందాడు. కోసిగి మండలం సజ్జలగుడ్డం గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కురువ చంద్ర, రోజమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రాత్రి గ్రామంలో తమ బంధువుల మరుపెళ్లి కార్యక్రమం ఉండగా చంద్ర కుటుంబంతో వెళ్లాడు. కాగా నూతన దంపతుల ఊరేగింపులో డీజే జీపు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆ జీపు బ్రేకులు ఫెయిల్ అయి ముందుకు దూసుకెళ్లింది. జీపు ముందు ఉన్న చిన్నారులు కొందరు తప్పుకోగా చంద్ర కుమారుడు మనోజ్‌కుమార్ (5) అలియాస్ తిక్కస్వామిపై జీపు ఎక్కింది. బాలుడు తలకు తీవ్ర రక్త గాయాలు కాగా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీటి శోకసంద్రంలో మునిగిపోయారు. జీపు డ్రైవర్ మద్యం తాగి ఉండడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చంద్రమోహన్ గ్రామానికి చేరుకుని బాలుడు మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన సోమమ్మ

నందవరం : మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో కురవ సోమమ్మ(44) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు... గ్రామంలో కురవ నరసింహులు భార్య సోమమ్మ ఏడాదిన్నరగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. కర్నూలు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించినా జబ్బు నయం కాకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందింది.దీంతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఇనుప కొక్కికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు చూసేసరికి మృత్యువాత పడింది. మృతి చెందిన సోమమ్మకు భర్త నరసింహులు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మార్కుల నమోదులో జాప్యం చేస్తే కఠిన చర్యలు

కర్నూలు కల్చరల్ : జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఏ మార్కుల నమోదులో జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి ఎస్ శామ్యూల్‌పాల్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం జరిగిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో సరాసరి 24 శాతం నమోదైందని, ఇలాగే కొనసాగితే పర్యవేక్షణ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 71 శాతం, ప్రైవేటు పాఠశాలలు 75 శాతం, ఎయిడెడ్ పాఠశాలలు 65 శాతం నమోదు చేశాయన్నారు. కర్నూలు, ఆదోని, కోసిగి మండలాలు వెనుకబడ్డాయని పేర్కొన్నారు. ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మెగా పేరెంట్స్ సమావేశం ఎలా నిర్వహిస్తామని ప్రశ్నించారు. విద్యాశాఖ కమిషనర్ ఆర్‌జేడీ, కలెక్టర్‌తో పాటు పలుమార్లు వెబెక్స్ సమావేశంలో హెచ్చరించినా చలనం లేదన్నారు. 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోగా వంద శాతం నమోదు పూర్తి చేయాలని, లేనిపక్షంలో ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిహారం ఇంకెప్పుడు?

● 2021 ఖరీఫ్‌లో కావేరి జాదు విత్తనంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 17 మండలాల్లో 7,255 ఎకరాల్లో పంట దెబ్బ
● రైతులకు ఎకరాకు రూ. 23,280 ప్రకారం పరిహారం చెల్లించాలని అవార్డు ఇచ్చిన జేడీఏ
● అందులో 60 శాతం కోత పెట్టిన వ్యవసాయ శాఖ డైరెక్టర్
● ఈ కొద్ది పరిహారం కూడా నేటికీ బాధిత రైతులకు అందని వైనం



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): కావేరి జాదు హైబ్రిడ్ పత్తి విత్తనం వేసి తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పట్లో అందేలా లేదు. ఇప్పటికే మూడేళ్లవుతున్నా అతీగతీలేదు. 2021 ఖరీఫ్‌లో రైతులు కావేరి జాదు హైబ్రిడ్ విత్తనంతో పత్తి సాగు చేశారు. అయితే ఈ విత్తనం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. కావేరి జాదు విత్తనం సాగు చేసిన మండలాల్లో నాటి వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. పంట దెబ్బతినడానికి విత్తనమే కారణమని తేల్చింది. దీంతో వ్యవసాయ యంత్రాంగం సుదీర్ఘంగా విచారణ జరిపి రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని అవార్డు ఇచ్చారు. జిల్లా వ్యవసాయ శాఖ మొదటిసారిగా కాటన్ సీడ్ రెగ్యులేటరీ చట్టం-2007 అమలు చేసింది. ఉమ్మడి జిల్లాలోని గూడూ రు, కోడుమూరు, కల్లూరు, మిడుతూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, నందికొట్కూరు, ఓర్వకల్, ఆదోని, కౌతాళం, ఆస్పరి, దేవనకొండ, పాములపాడు, కొత్తపల్లి, పాణ్యం, ఉయ్యలవాడ మండలాల్లో కావేరి జాదు పత్తి విత్తనం కారణంగా 1899 మంది రైతులు 7255.7 ఎకరాల్లో నష్టపోయారు. ఎకరాకు సగటున 3 క్వింటాళ్ల పత్తిని కోల్పోయినట్లు అంచనా వేసిన విచారణ కమిటీ క్వింటాలుకు రూ.7,760 చొప్పున ఎకరాకు రూ.23,280 ప్రకారం రూ.16.91 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశాలు ఇచ్చారు. దీనిపై కావేరి సీడ్ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు జేడీఏ అవార్డుపై వ్యవసాయ శాఖ కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు సదరు కంపెనీ అప్పీల్ చేసుకుంది. దీనిపై సుదీర్ఘ విచారణ అనంతరం వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు ఇటీవల అవార్డు ఇచ్చారు. అయితే, 2021 డిసెంబరు 21న జేడీఏ ఇచ్చిన అవార్డులో 60 శాతం కోత పెట్టడంపై రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తమకంటే ఎక్కువగా సీడ్ కంపెనీపైనే వ్యవసాయశాఖ డైరెక్టర్ సానుభూ తి చూపారని ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా వ్యవసాయ శాఖ డైరెక్టర్ జడ్జిమెంటు ప్రకారం 40 శాతం పరిహారనైనా రైతులకు వెంటనే చెల్లించాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అతిథులొచ్చారు!

● హిమాలయాల నుంచి పెయింటెడ్ కొంగలు రాక



చెట్టుపై ఠీవీగా ఉన్న ఎర్రకాళ్ల కొంగ

ఆత్మకూరు రూరల్: మనిషి ఊహలు సుదూర లక్ష్యాలను అందుకునే స్ఫూర్తిని కలిగించింది పక్షులే. తమ రెక్కల శక్తితో విహంగాలు ఖండాంతరాలను, సప్త సముద్రాలను అవలీలగా లంఘిస్తుంటాయి. శ్రీశైలం వెనుకతట్టు జలాలు, వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, సిద్దాపురం చెరువు వంటి జలాశయాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉండడం వల్ల ఈ ప్రాంతం పెద్ద పక్షి కేంద్రంగా మారుతోంది. ఉత్తర ధ్రువం నుంచి కూడా వైట్ బెల్లీడ్ టర్న్ వంటి పక్షులు ఈ ప్రాంతానికి వస్తున్నాయి. అలా వలస వచ్చే పక్షుల్లో ఎర్రకాళ్ల కొంగగా పిలువ బడే పెయింటెడ్ స్టార్క్ పక్షులూ ప్రధానమైనవి. ఇవి తెల్లటి ఈకలపై పచ్చటి డిజైన్‌తో అందంగా కనిపిస్తాయి. ఇవి స్థానిక వలసతో పాటు ఖండాంతర వలసలు కూడా వెళతాయి. మనదేశంలోని హిమాలయ ప్రాంతం నుంచి చలికాలంలో దక్షిణ భారత దేశానికి ప్రత్యుత్పత్తి కోసం పెయింటెడ్ స్టార్క్‌లు వస్తుంటాయి. ఆత్మకూరు మండలంలో పెయింటెడ్ స్టార్క్‌లు ఇటీవల చిన్నపాటి నీటి వనరుల వద్ద కూడా కనిపిస్తూ, నువిందు చేస్తున్నాయి. మండలంలోని కరివేన గ్రామ శివారులో ఉన్న కుంట వద్ద చెట్టుపై కనిపించిన పెయింటెడ్ స్టార్క్ పక్షి బుధవారం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.